

ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిని కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం. నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమానికి మార్కెట్ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, సభ్యులు అంజయ్య, లక్ష్మి, మచ్చేంద్రరెడ్డి, రఘుపతిరెడ్డి, గణేశ్‌నాయక్, నర్సింహ, మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.



వీణారెడ్డికి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కసిరెడ్డి, చెన్నప్ప తదితరులు

మీర్‌పేట్ రచయిత్రికి సాహిత్య పురస్కారం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌కాలనీకి చెందిన రచయిత్రి డాక్టర్ వీణాహన్మంత్‌రెడ్డికి తెలంగాణ సాహితీ సాంస్కృతిక సంస్థ 'ఆచార్య పాకాల యశోదారెడ్డి సాహిత్య పురస్కారం' ప్రకటించింది. ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఓయూ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆచార్య చెన్నప్ప ఆమెకు పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. పురస్కారం రావడం పట్ల వీణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న రమణారెడ్డి, తదితరులు

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి సన్మానం

చంపాపేట, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ రమణారెడ్డి వంద మంది అనుచరులతో కలిసి ఆయనను గజమాలతో సన్మానించారు. భవిష్యత్‌లో మహేందర్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని రమణారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సుర్వీ పెంటయ్యగౌడ్, ముత్యాల సత్యనారాయణ, దేరంగుల కృష్ణ, బెక్కం లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, అన్నుకుమార్, సంజీవరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఖాదర్, హైలేష్‌యాదవ్, దర్వేష్‌ఖాన్, చిరంజీవి, జమీల్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చంపాపేట, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీలో సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 1982-83లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాడు చదువు చెప్పిన పలువురు గురువులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంకాల శేఖర్‌రెడ్డి, పి.నగేష్, సి.యాదగిరి, సామ్యూల్, అశోక్, డి.లక్ష్మయ్య, ఏ.చంద్రయ్య, శివకుమార్, టి.వెంకటేష్‌గౌడ్, కె.నాగేందర్, కరుణాకర్‌రెడ్డి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాందారిసింగ్ దినకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జోత్స్నప్రభ

హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో హిందీ దివస్

హయత్‌నగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ కవి రాందారిసింగ్ దినకర్ జయంతిని పురస్కరించుకుని హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాందారిసింగ్ దినకర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం గ్యాస్ సబ్సిడీ బాండ్ల పంపిణీ

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ గ్యాస్ పొందుతున్న లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ బాండ్లను రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. సోమవారం ఓల్డ్‌మలక్‌పేటలో రేషన్ షాపువద్ద సబ్సిడీ బాండ్లను తీసుకునేందుకు లబ్ధిదారులైన మహిళలు పెద్దఎత్తున క్యూకట్టారు. వారి పేరు మీద ఉన్న బాండ్లను తీసుకెళ్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తెలుగులో రూపొందించిన ఈ బాండులో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రభుత్వం అభయహస్తం పథకం ద్వారా రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్ అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు వారి పేరుతో పాటు మంజూరైన సబ్సిడీ సిలిండర్ల వివరాలను ఇందులో నమోదు చేశారు.



ఓల్డ్‌మలక్‌పేటలో రేషన్‌షాపు వద్ద బాండ్ల కోసం క్యూకట్టిన మహిళలు

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి తెలిపారు. ఇప్పటి వరకు కోర్టు బెంచ్‌మీదకు రాని, కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు ఇదొక చక్కటి అవకాశం అన్నారు. అదాలత్‌లో కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా డబ్బులతో పాటు సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, డబ్బు రికవరీ, యాక్సిడెంట్, చిట్‌ఫండ్, ఎలక్ట్రిసిటీ, చెక్కుబౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కేసులు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

● చైర్‌పర్సన్ స్వప్నాచిరంజీవి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నాచిరంజీవి అన్నారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు పసుమాముల గ్రామంలో స్వప్నచిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

కల్వంచలో..

మున్సిపాలిటీ పరిధిలోని పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాల, కల్వంచలోని గురుకుల కళాశాలలో స్వచ్ఛత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే స్వచ్ఛత సేవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పసుల రాజేందర్‌ముదిరాజ్, సామ దీపికారెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగనాయకుల కాలనీలో స్వచ్ఛత సేవ

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి 12వ డివిజన్ పరిధిలో గల రంగనాయకుల కాలనీలో సోమవారం స్వచ్ఛత సేవ కార్యక్రమం నిర్వహించారు. ముచ్చింతల్‌లోని జీయర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(జిమ్స్) ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీలోని అన్ని వీధుల్లో స్వచ్ఛత సేవపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా వీధులను శుభ్రం చేసి, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి నీరుపోశారు. స్థానిక పారిశుధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సైతం అందజేశారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిమ్స్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ విరాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పవల్లి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



రంగనాయకుల కాలనీలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్న జిమ్స్ ఎన్ఎస్ఎస్ బృందంతో కార్పొరేటర్ పవన్‌కుమార్‌యాదవ్



మొక్కలు నాటుతున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి తదితరులు



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ స్వప్నాచిరంజీవి

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో సోమవారం స్వచ్ఛత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజాపూర్‌లోని ఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కమిషనర్ అమరేందర్‌రెడ్డి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఓ శ్రీనివాసులు, ఈఈ హరీష్, వార్డు అధికారులు కృష్ణవేణి, బిల్ కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోపరేటివ్ బ్యాంకులు వడ్డీలేని రుణాలందించాలి

● త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చిరువ్యాపారులకు ఎంఎస్ఎంఈ ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాల మాదిరిగా కోఆపరేటివ్ బ్యాంకులు కూడా రుణాలిచ్చి ప్రోత్సహించాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కోరారు. మలక్‌పేటలో నిర్వహించిన తిరుమల బ్యాంకు 27వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా తిరుమల మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలందించే కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో కోఆపరేటివ్ బ్యాంకింగ్ వ్యవస్థ తనదైన ముద్ర వేసిందన్నారు. ఇందులో తిరుమల బ్యాంక్ ముందు వరుసలో నిలవడం అభినందనీయమన్నారు. బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీనటుడు సుమన్‌తోపాటు శ్రీనివాస్, మల్లికార్జున్ రావు, దుర్గాప్రసాద్, గోపీకృష్ణ మన్నెపల్లి, రామన్న, హరిహరకుమార్, బ్యాంక్ డైరెక్టర్లు, ఖాతాదారులు, వినియోగదారులు పాల్గొన్నారు.



మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, పక్కన సినీనటుడు సుమన్, చైర్మన్ చంద్రశేఖర్

హరిరాజ్‌గౌడ్‌కు త్రిపుర గవర్నర్ నివాళి

ఎల్బీనగర్ : సంఘసేవలో హరిరాజ్‌గౌడ్ ఎప్పుడు ముందుండేవారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ గౌడ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, జ్యోతిక్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి, శివాలయం ట్రస్ట్ సలహాదారుడు జాజుల హరిరాజ్‌గౌడ్ సంస్మరణ సభ సోమవారం జ్యోతిక్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరిరాజ్‌గౌడ్ చిత్రపటం వద్ద ఇంద్రసేనారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్, లింగోజిగూడ ప్రాంతాలలో హరిరాజ్‌గౌడ్ చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఈ సభలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రతినిధి మల్లికార్జున్, విద్యాన్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, జ్యోతిక్లబ్ అధ్యక్షుడు ఆకుల దయానిధి, జగదీశ్వర్‌యాదవ్, దయానందస్వామి, దయానంద్, మల్కాజిగిరి కుమార్, జాజుల ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



హరిరాజ్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సామ రంగారెడ్డి



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా

ఆపన్న హస్తం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎల్బీనగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): ఆపన్నహస్తం ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్‌లో సంపత్‌నికిత ఆధ్వర్యంలో పేదలకు కుట్టుమిషన్లు, చీరలు, నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు చింతల రజనీకాంత్‌గుప్తా, మొగుళ్లపల్లి ఉపేందర్, ఉప్పల రాజ్యలక్ష్మి, కటకం శ్రీనివాస్, సురేష్‌గుప్తా, శ్రీధర్, వీరేందర్ పాల్గొన్నారు.



రెడ్డికాలనీలో మారుతీ ఆస్పత్రి లైన్‌లో రహదారిపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మురుగు పరుగులు.. కంపుకొడుతున్న రెడ్డికాలనీ

చంపాపేట, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని రెడ్డికాలనీలోని మారుతీ ఆస్పత్రి లైన్‌లో రహదారిపై డ్రైనేజీ నీరు తరచూ పొంగుతుండడంతో కాలనీవాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా వారు తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడిన నాడు వేసిన పైపులైన్‌కు కాలం చెల్లడంతో తరచూ పైపులు నిండుకొని నీరంతా బయటకు వస్తుందని, ప్రస్తుత జనాభాకు అనుగుణంగా నూతనంగా డ్రైనేజీ పైపు లైన్ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కాలనీవాసులు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి అనారోగ్యంతో ఆత్మహత్య

మన్సూరాబాద్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురంభీమ్ జిల్లా ఆసిఫాబాద్‌కు చెందిన పొడిశెట్టి శ్రీనివాస్(49) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నాగోల్‌లోని సాయినగర్‌లో మూడేళ్లుగా భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సునీత వచ్చి ఇంటి తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో డోర్ పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో శ్రీనివాస్‌ను కిందకు దించి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నరేంద్రమోదీ పాలనలో దేశ ప్రజలందరు సుభిక్షం

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశ ప్రజలందరు సుభిక్షంగా ఉన్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పార్టీ ఆదేశాల మేరకు సేవా మహాయజ్ఞం(సేవా పక్వాడ్) కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాలలో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న గొప్ప నాయకుడు మోదీ అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణం, గాంధీ విగ్రహాన్ని శుద్ధిచేసి పూల మాలలతో ని వాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్ కుమార్‌గౌడ్, విజయ్‌కుమార్, క్రాంతిగౌడ్ పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణను శుభ్రంచేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

పల్లవిలో స్టడీ అబ్రాడ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎక్స్‌పో

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో 14 యూనివర్సిటీలతో పల్లవి స్టడీ అబ్రాడ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ -2024 ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ రమేష్‌పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ ఎక్స్‌పో సువర్ణ అవకాశం అన్నారు. ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ రాసే విద్యార్థులకు రూ. 15వేల స్కాలర్‌షిప్ వస్తుందని ఆయన తెలిపారు. పబ్లిక్ యూనివర్సిటీలో సీటు తెచ్చుకుంటే తక్కువ ఫీజుతో పాటు ప్రభుత్వం కూడా రూ. 20లక్షల సహాయం చేసే స్కీములు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంటీ. రాజు, కళాశాల డైరెక్టర్ రామ శేషగిరిరావు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ డాక్టర్ మల్కా కొమురయ్య, డైరెక్టర్ నవీన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, ఏఓ అంబాల శ్రీధర్, కళాశాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రమేష్‌పతి తదితరులు

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

వనస్థలిపురం, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రెడ్‌వాటర్ ట్యాంక్ సమీపంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో సోమవారం వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సహకారంతో స్వామివారి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, వైస్‌చైర్మన్ బి.వి పాపారావు, కె.సత్తయ్య, కోశాధికారి కె.శ్రీధర్, జె.రామలక్ష్మి, కె.సాంబశివరావు, పి.సునీల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, చైర్మన్ లక్ష్మయ్య

ఘనంగా లడ్డూ వేలం పాట

హయత్‌నగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామంలోని వేణుగోపాలస్వామి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు పోరెడ్డి నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.2.25 లక్షలకు కేఎస్ఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి కందకట్ల తిరుమల్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. స్వామి వారి శాలువాను రూ. 1 లక్షల 29వేలకు కందాళ బిందు రంగారెడ్డి, దోతిని రూ. 1లక్ష 29 వేలకు సాలగారి రంగారెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో కోహెడకు చెందిన సీనియర్ నాయకుడు సామల బాల్‌రెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ అర్జున్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బూర మహేష్, స్థానిక నాయకులు భిక్షపతి, సాలగారి రంగారెడ్డి, వెంకట్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణుచారి, యంజాల శ్రీనివాస్‌రెడ్డి, యూసూఫ్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.



లడ్డూను దక్కించుకున్న తిరుమల్‌రెడ్డి

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సోకోర్టు న్యాయమూర్తి తీర్పుచెప్పారు. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. తన కుమార్తెను షైనం కుమార్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వేధించడంతో పాటు ఫోన్‌కు అశ్లీల చిత్రాలు, సందేశాలు పంపుతు తన కుమార్తె ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని 20 ఫిబ్రవరి 2020న బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి నిందితుడికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.



మాట్లాడుతున్న శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, అనిల్

మరుగుదొడ్ల మాటున అక్రమార్జన

● సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన లూ కేఫే ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు లూ కేఫే నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లికి చెందిన శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, లూ కేఫే నిర్వాహకులు అనిల్, భరత్‌లు వివరాలు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులలో ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్లు పిలవగా బీహార్‌కు చెందిన ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత అభిషేక్ నాథ్ అప్పటి ప్రభుత్వ పెద్దలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ల సహకారంతో కాంట్రాక్టు దక్కించుకున్నాడని అన్నారు. శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో డివిజన్‌కు 13 చొప్పు న సుమారు వందకు పైగా లూ కేఫేలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిందని, వాటిని నిర్వహణ చూస్తామని చెప్పి ఒక్కో లూ కేఫేను ఇరవై వేల రూపాయలు నుంచి లక్ష రూపాయల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని నెలకు ఎనిమిది నుంచి పది వేలకు పైగా చెల్లించే విధంగా వేరే వారికి కట్టబెట్టారని అన్నారు. ఒక్కో కేఫేకు జీహెచ్ఎంసీకి సంవత్సరానికి కేవలం రూ.1385 రూపాయలు మాత్రమే కడుతూ తమ వద్ద నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నాడని, ఈ విధంగా అతను నెలకు కోటి రూపాయల వరకు సంపాదిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి అతని సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి తమకే వాటి నిర్వహణ అప్పగించాలని అన్నారు.

లూ కేఫేల చుట్టూ యాడ్స్ ప్రదర్శిస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఒక్కో కేఫేకు సుమారు 3.40 లక్షల రూపాయలను జీహెచ్ఎంసీ వెచ్చించిందని అన్నారు. లూ కేఫేల నిర్వహణ, తదితర వాటిపై విచారణ జరిపించాలని, గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన అప్పటి సీఎస్, మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించామని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అన్నారు. సమావేశంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ ఆత్మహత్య

అల్వాల్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామానికి చెందిన పరుశురాం కుటుంబం 10 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి అల్వాల్ కానాజిగూడ శివానగర్‌లో భార్య భాగ్యలక్ష్మితో నివసిస్తున్నారు. ఈ దంపతులకు ఆరేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. భర్త పరుశురాం బోయిన్‌పల్లి మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం భాగ్యలక్ష్మి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతికి గల కారణాలు వెల్లడి కాలేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.